నేడు 44 పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో గుర్తించిన 44 పాఠశాలలకు ఈ నెల పదో తేదీ మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు డిఇఒ ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. భీమడోలు మండలంలో ఒక పాఠశాలకు, పెదపాడు మండలంలో ఏడు పాఠశాలలకు, మండవల్లి మండలంలో 18, కైకలూరు మండలంలో తొమ్మిది, ఏలూరు మండలంలో ఒక పాఠశాలకు, ముదినేపల్లి మండలంలో మూడు, కలిదిండి మండలంలో ఐదు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని మిగిలిన పాఠశాలలన్నీ యథావిధిగా పని చేయాలని, మధ్యాహ్న భోజనం, తాగునీరు, పారిశుధ్యం విషయాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఇఒలను, ప్రధానోపాధ్యాయులను ఆయన ఆదేశించారు.

'నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన నెరుసు శ్రీనివాసరావు నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశారు. ఇటీవల వరదలకు పెదచెరువు గండిపడి రెండెకరాల పంట ముంపునకు గురై దెబ్బతింది. రైతు శ్రీనివాసరావుకు అధికారులు కౌలుకార్డు కూడా ఇవ్వలేదు. ఎకరాకు రూ.20 వేలు చొప్పున పెట్టుబడి పెట్టడంతో రూ.40 వేలు వరకూ రైతులు నష్టపోయారు. పంట నష్టపరిహారం వస్తుందో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పంట నష్టపోయిన కౌలురైతు శ్రీనివాసరావుకు పరిహారం ఇస్తుందా అనే అనుమానం నెలకొంది.

నూజివీడులో పెదచెరువుకు గండిపడి కౌలురైతు కాటూరి శ్రీనివాసరావుకు చెందిన రెండెకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.40 వేలు వరకూ రైతు నష్టపోయాడు. అధికారులు కౌలుకార్డు ఇవ్వకపోవడంతో పంట నష్టపరిహారం అందజేతపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని, లేకపోతే తమ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని కౌలురైతు శ్రీనివాసరావు లబోదిబోమంటున్నాడు.

కౌలు రైతులే బాధితులు..!

వరుస విపత్తులతో కోలుకోలేని స్థితిలోకి కౌలురైతులు

కౌలుకార్డులు ఇవ్వకపోవడంతో పంటనష్టంపై నీలినీడలు

ప్రతియేటా ఇదే పరిస్థితి.. సాగుదారుని గురించి పట్టని పాలకులు

ప్రస్తుత ఖరీఫ్‌లో ఇప్పటికే 20 వేల ఎకరాల్లో పంటనష్టం

పంట నష్టపరిహారం మళ్లీ భూయజమానులకేనా?

నూజివీడులో పెదచెరువుకు గండిపడడంతో దెబ్బతిన్న పంటపొలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో కౌలురైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఏఒక్క కౌలురైతునూ పలుకరించినా కన్నీటిపర్యంతమవుతున్న పరిస్థితి ఉంది. ప్రస్తుత ఖరీఫ్‌లో రెండు సార్లు భారీవర్షాలు, వరదలు విరుచుకుపడటంతో కౌలురైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాలవ్యాప్తంగా ఖరీఫ్‌లో నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తుండగా 80 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. రెండు జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో సగం మందికి కూడా ప్రభుత్వం కౌలుకార్డులు ఇవ్వలేదు. జారీ చేసిన కార్డుల్లో ఎన్ని అర్హులకు అందాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. వరదలకు పంట నష్ట బాధితులంతా కౌలురైతులే ఉన్నారు. రెండుసార్లు విరుచుకుపడిన వరదలకు జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాల వరకూ వరిపంట దెబ్బతింది. జులైలో వరదలకు రెండు జిల్లాల్లో రూ.11 కోట్లు పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు తేల్చారు. ప్రస్తుత వరదలకు దాదాపు 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఒక నూజివీడు డివిజన్‌లోనే ఆరు వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వకపోవడంతో పంట నష్టపరిహారం అందజేతపై నీలినీడలు అలుముకున్నాయి. ఇ-క్రాప్‌లో పేరు నమోదైతే తప్ప పంట నష్టపరిహారం అందే పరిస్థితి ఉండదు. ఇ-క్రాప్‌లో భూయజమానుల పేర్లనే అధికారులు నమోదు చేస్తున్నారు. దీంతో పంట నష్టపరిహారం కౌలురైతులకు ఇచ్చే పరిస్థితి కన్పించడం లేదు. ప్రభుత్వం పంట కోల్పోయిన కౌలురైతుల పేర్లను నమోదు చేసి నష్ట పరిహారం అందజేతకు చర్యలు తీసుకోవాలని పంట దెబ్బతిన్న రైతులు కోరుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రతియేటా రెండు జిల్లాల పరిధిలో వరదలు, భారీవర్షాలకు పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టపరిహారం మాత్రం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోయాయి. బీమా పరిహారం సైతం యజమానుల ఖాతాల్లోకే చేరింది. దీంతో కౌలురైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. ఆత్మహత్య చేసుకున్న పలువురు కౌలురైతుల కుటుంబాలకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అప్పట్లో రూ.లక్ష చొప్పున సాయం సైతం అందించారు. ఇప్పుడు ఆయనే డిప్యూటీ సిఎంగా ఉన్నారు. పంటనష్ట నమోదు జాబితాలో కౌలురైతుల పేర్లు నమోదు చేసి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటారో.. లేదో వేచిచూడాలి.

అరకొరగా కౌలుకార్డులు జారీ

రెండు జిల్లాల్లో కౌలుకార్డుల జారీ ప్రక్రియ అరకొరగానే సాగింది. నూజివీడులో పంట నష్టపోయిన కౌలురైతుల్లో మూడొంతుల మందికి కౌలుకార్డులే లేకుండా పోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది. జారీ చేసిన కౌలుకార్డులు సైతం అర్హులకు చేరాయా అనే అనుమానాలు సైతం నెలకొన్నాయి. భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అటువంటి పరిస్థితి లేకుండాపోయింది. 2019 పంటహక్కు సాగుదారుని చట్టంలో మార్పులు చేస్తే తప్ప భూయజమానితో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేయలేమంటూ అధికారులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ విఆర్‌ఒ సంతకంతో కౌలుకార్డులు జారీ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పిన పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. కౌలుదారులందరికీ కౌలుకార్డులు అందజేయడంతోపాటు పంట నష్టపరిహారం అందించినప్పుడే వాస్తవ సాగుదారులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

కొల్లేరుకు తగ్గని వరద ఉధృతి

ప్రజాశక్తి - మండవల్లి

వరద నీరు కొల్లేరులోకి వచ్చి చేరుతూనే ఉంది. కొల్లేరులో ఏ దిక్కుకు చూసినా ముంపు నీరే కన్పిస్తోంది. ఏలూరు-కైకలూరు ప్రధాన రహదారిపై వరద నీటి ప్రవాహం చినఎడ్లగాడి వంతెనను తాకింది. దీంతో కొల్లేటి నీటిమట్టం 3.4 మీటర్లకు చేరింది. బుడమేరుకు పడిన గండ్లను పూడ్చేయడంతో వరద నీరు మరింత కొల్లేరులోకి వచ్చే అవకాశం కన్పిస్తోంది. దీంతో నీటిమట్టం మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

మండవల్లిలో డిఎల్‌పిఒ పరిశీలన

నిత్యావసరాలు తరలిస్తున్న సిబ్బంది

నిత్యావసర సరుకులు అందిస్తున్నాం ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్

కొల్లేరు వరద నీటిమట్టం సోమవారం అరమీటరు మాత్రమే పెరిగిందని గోపాల్ తెలిపారు. లంక గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే పడవలను ఏర్పాటు చేశామన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని, ఏమైనా వరద తగ్గే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పునరావాస కేంద్రాలకు రావాలి: డిఎల్‌పిఒ

ముంపు ప్రాంత ప్రజలు పునరావాస ప్రాంతాలకు వెళ్లి సురక్షితంగా ఉండాలని డిఎల్‌పిఒ చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. మండవల్లిలో ప్రభుత్వ కార్యాలయాల ప్రాంతాల్లో ఊర చెరువు పొంగి నీట మునిగిన నివాసాలను ఆయన సోమవారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. వరద బాధితులను ఆదుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టిందన్నారు. ముంపు బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించామన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి తహశీల్దార్ గోపాల్, ఎంపిడిఒ పివి.రమణ, సర్పంచి మెండ ఝాన్సీ, ఇఒపిఆర్‌డి ఆనందబాబు, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

వరద బాధితులకు అండగా ఉంటామని, వారి రక్షణకు, సంరక్షణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు హామీ ఇచ్చారు. ఆయన మండలంలోని కొల్లేరు లంక గ్రామాలను సోమవారం సందర్శించారు. వరద ప్రమాదపు అంచున ఉన్న మల్లవరంలో స్థానికులతో మాట్లాడారు. వరద పరిస్థితిని అంచనా వేసేందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొల్లేరు వెనక్కు ఎగదన్నినా, వానలు కొనసాగినా, తమ్మిలేరు ఉధృతి పెరిగినా లంక గ్రామాలకు వరద ప్రమాదం పెద్దఎత్తున ఉంటుందని ఎంఎల్‌ఎ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ వారి రక్షణకు అన్ని చర్యలూ తీసుకుంటామని, పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. మల్లవరం పాఠశాలలోకి ప్రవేశించిన వరద నీరు, శిథిలమైన తుపాను రక్షిత కేంద్రాన్ని పరిశీలించారు. వరద పరిస్థితిపై మండలస్థాయి అధికారులతో అక్కడే సమీక్ష నిర్వహించారు. ఆగడాలలంక ఛానల్ ఉధృతంగా ప్రవహించడంతో ఛానల్‌లోని నీరు రోడ్డుపైకి రాకుండా కంకర బస్తాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలపై ఎంపిడిఒ పద్మావతిదేవి, తహశీల్దార్ రమాదేవి ఎంఎల్‌ఎకు వివరించారు. అనంతరం నిర్మాణం ప్రారంభమై వర్షాల కారణంగా నిలిచిన చెట్టున్నపాడు-మల్లవరం రోడ్డు పనులను పరిశీలించారు. నల్లకోడు మురుగు కాలువ ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. అక్కడ వంతెన పటిష్టతపై ఆరా తీశారు. ఆ ప్రాంతంలో అదనపు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. నల్లకోడు వాగులో ప్రవాహానికి అడ్డంగా ఉన్న తూడు, కిక్కిస తొలగింపునకు చర్యలు తీసుకోవాలని మురుగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భీమడోలు మాజీ ఎంపిపి సిరిబత్తిన కొండబాబు, కూటమికి చెందిన వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మల్లవరంలంకలో పరిశీలిస్తున్న ఎంఎల్‌ఎ ధర్మరాజు

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

బుడమేరు వరద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలి

వరద ప్రభావిత గ్రామాల్లో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి - పెదపాడు

వరద ప్రభావిత ప్రాంత ప్రజలను, రైతులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. సోమవారం పెదపాడు మండలంలోని గోగుంట, వసంతవాడ వరద ప్రాంత గ్రామాల్లో సిపిఎం జిల్లా నాయకుల బృందం పర్యటించింది. గోగుంట ఎస్‌సి కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్లి వరద బాధితులను పరామర్శించి వరద నష్టం వివరాలను వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. వసంతవాడ హైస్కూల్లో వరద బాధితుల శిబిరాన్ని సందర్శించారు. వరద వల్ల తీవ్రంగా నష్టపోయామని బాధితులు సిపిఎం నాయకుల ముందు వాపోయారు. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ఇంటి సామాన్లన్నీ పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతమని ఆందోళన వ్యక్తం చేశారు. బుడమేరు వరద ఫలితంగా ప్రజలు, రైతాంగం తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఇళ్లలో ఉన్న మొత్తం సామాన్లు సైతం పాడైపోయాయని, తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించారు. పంటలు సైతం దెబ్బతిన్నాయని, పేద, కౌలురైతులు నష్టపోయారని అన్నారు. నష్టాన్ని వెంటనే అంచనా వేసి పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని కోరారు. పాలకుల నిర్లక్ష్యం వల్లే వరదకు కారణమని విమర్శించారు. కొల్లేరుకు వెళ్లే అన్ని మురుగు కాలవలు చేపల చెరువుల తవ్వకాలతో ఆక్రమణలకు గురి కావడమే వరదకు కారణమన్నారు. ఇప్పటికైనా వరద నివారణకు ప్రభుత్వం శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ మాట్లాడుతూ వరద ప్రాంత ప్రజలకు తక్షణ సహాయం అందించాలన్నారు. గోగుంట ఎస్‌సి కాలనీలో పాడైన ఇళ్లను ప్రభుత్వం నిర్మించాలని కోరారు. ఉపాధి కోల్పోయినందుకు పని దినాలు లెక్కించి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గుండపనేని సురేష్, షేక్ కరీముల్లా, వరద బాధితులు తానింకి రాయప్ప, ఎలిజిబెత్ రాణి, డోలా సుబ్బారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోగుంటలో ఎస్‌సి కాలనీలో సిపిఎం నేతల పరిశీలన

ఏలూరు అర్బన్: వరద నీటితో ముంపునకు కొల్లేరు లంక గ్రామాల ప్రజలను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఉదయం ఆయన నేతృత్వంలో సిపిఎం బృందం కొల్లేరు లంక గ్రామాలను పరిశీలించింది. రూరల్ మండలంలోని మాధవరంలో పర్యటించిన ఆయన స్థానిక ఆక్వా రైతులు, ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండలంలో మాధవరం, మొండికోడు, కోమటిలంక, యాగనమిల్లి, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక తదితర లంక గ్రామాల్లో భారీగా వరద నీరు చేరడంతో ఆ గ్రామాల ప్రజలు నీటిలో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏలూరు నుండి చాటపర్రు మీదుగా లంక గ్రామాలకు వెళ్లే రహదారులు జలమయమయ్యాయని తెలిపారు. ఆ లంక గ్రామాలకు ఏలూరు నుండి వెళ్లాలంటే భీమడోలు మండలం గుండుగొలను మీదుగా 60 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని తెలిపారు. బాధిత ప్రజలకు నిత్యావసర సరుకులు, తాగునీరు, మందులు ఉచితంగా అందించాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. భారీగా వరద నీరు చేరడంతో ఇప్పటివరకు చేతికొస్తుందనుకున్న ఆక్వా పంట చేజారిపోయేలా కనిపిస్తుందన్నారు. ఆక్వా రైతులు తమ చెరువుల వద్దకు వెళ్లడానికి, ప్రజల రాకపోకలకు బోట్లు ఏర్పాటు చేయాలి డిమాండ్ చేశారు. ఆ గ్రామాల్లోని రోజువారి వ్యవసాయ కూలీలకు వరద ఉధృతి తగ్గేవరకు అన్ని రోజులకు ప్రభుత్వమే కూలి డబ్బు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, పి కిషోర్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పివి.రామకృష్ణ, ఏలూరు నగర కమిటీ సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది

పంట నష్ట నమోదును పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - ఏలూరు

వరదలు, భారీ వర్షాల మూలంగా పంట నష్టం అంచనాల వివరాల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. సోమవారం పెదపాడు మండలం సత్యవోలు, నాయుడుగూడెంల్లో పంట నష్టం నమోదు వివరాల ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ పంట దెబ్బతిన్న రైతులు ఎవ్వరూ అధైర్యపడొద్దని సూచించారు. పంట నష్టం వివరాలు మంగళవారం సాయంత్రంలోగా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పంట నష్టాలను ఏవిధంగా నమోదు చేస్తున్నారో ఆమె పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్ భాషా మాట్లాడుతూ ఇ-పంట నమోదులో ఏలూరు జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని వివరించారు. జాయింట్ కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, తహశీల్దారు ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ప్రదీప్ తదితరులు ఉన్నారు.

పరిశీలిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

వరద బాధితులకు యుటిఎఫ్ ఆపన్నహస్తం

ఏలూరు అర్బన్: విజయవాడలో కృష్ణానది వరదల్లో ఇబ్బంది పడుతున్న ప్రజలకు, అలాగే ఏలూరు జిల్లాలో అనేక మండలాల్లో ముంపునకు గురై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఉపాధ్యాయుల వైపు నుండి సహకారం అందిస్తున్నామని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫా అలీ, ఆర్.రవికుమార్ తెలిపారు. ముంపు ప్రజలను ఆదుకోవడానికి అనేక మంది ఉపాధ్యాయులు వివిధ మండలాల నుండి ఆర్థిక సహకారం, వస్తువుల రూపంలో సహకారం అందించడానికి ముందుకొచ్చారని, దానిలో భాగంగా సోమవారం పెదపాడు మండలం గోగుంట గ్రామానికి చెందిన ప్రజలు వసంతవాడ పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న వారికి ఉపాధ్యాయుల నుంచి సేకరించిన బట్టలు చీరలు, ప్యాంట్లు, షర్టులు, చిన్నపిల్లల బట్టలు, దుప్పట్లు ఇచ్చారన్నారు. అలాగే ప్రజలకు ఆహార పదార్థాలు, 400 యాపిల్స్, 500 ప్యాకెట్ల బిస్కెట్లు యుటిఎఫ్ జిల్లా కమిటీ తరపున అందజేశామన్నారు. ఈ కార్యక్రమానికి ప్రోత్సహించిన డిఇఒ ఎస్.అబ్రహంకు, కలెక్టర్ వెట్రిసెల్వికి యుటిఎఫ్ తరపున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తమతోపాటు రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి కె.కమల్‌కుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారని వివరించారు.

గోగుంటలో సామగ్రి పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నేతలు

11 నుంచి కొత్త పాలసీలో ఉచిత ఇసుక

పారదర్శకంగా ఇసుక సరఫరాకు ఏర్పాట్లు

ఇసుక రవాణా వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఇసుక రవాణా చేసే వాహనాలను ఆన్‌లైన్ ద్వారా వెంటనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఇసుక సమన్వయ శాఖల అధికారులు, లారీ యజమానులతో ఆమె సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాలసీపై అవగాహన కల్పించారు. ఈ నెల 11 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత ఇసుక విధానంలో కొత్త మార్గదర్శకాల మేరకు పంపిణీ విధానం ఉంటుందన్నారు. పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో ఉచిత ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా లారీ యాజమానులు తమ వాహనాలను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. నూతన ఇసుక విధానం ప్రజలకు మేలు జరిగేలా ట్రాన్స్‌పోర్టర్లు సహకరించాలన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌పోర్టర్లకు అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. ప్రస్తుతం గరిష్టంగా రోజుకు 20 టన్నుల వరకు ఒక వ్యక్తికి ఇస్తారని, జిల్లాలో సరాసరి రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నులు బుకింగ్ జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా లారీ యజమానులు ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి రవాణా ఛార్జీలు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇసుక రవాణాకు వాహనాల రవాణా ఛార్జీలను రాష్ట్రమంతటా ఒకే విధంగా ఉండేలా ప్రభుత్వం నిర్ధారిస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మరిన్ని ఇసుక డీసిల్టింగ్ చేపట్టేందుకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశం ఆమోదించింది. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ కొత్త ఇసుక పాలసీ విధానంలో అమలు చేయాల్సిన విధి విధానాలను వివరించారు. సమావేశంలో మైనింగ్ డిడి రవికుమార్, ఉప రవాణా కమిషనరు ఎస్.శాంతకుమారి, డిపిఒ టి.శ్రీనివాస విశ్వనాధ్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, ఆర్‌టిఒ శ్రీహరి, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ భాషా, ఇరిగేషన్, సెబ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి

'జల్లేరు'పై వంతెన నిర్మించాలని సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరు వాగుపై వంతెన నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. రెడ్డిగణపవరం-రామారావుపేట సెంటర్ మధ్య ఉన్న జల్లేరు వాగుపై కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా ధ్వంసమైందని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం వంతెన నిర్మించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణతోపాటు రెడ్డిగణపవరం గ్రామ కమిటీ నాయకులు పవన్, వెట్ట వీరయ్య మాట్లాడుతూ జల్లేరువాగుపై కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం స్పందించి రెడ్డిగణపవరం వద్ద జల్లేరువాగుపై వెంటనే వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో గ్రామ కమిటీ సభ్యులు కోర్స జలపాలు, పూనెం దుర్గారావు, కొమరం శ్రీరాములు, కట్టం వెంకటేశ్వరరావు, ఉయికె వెంకటేశ్వరరావు, కుంజా రవి, దారి రాజు, కోర్స చంద్రం, రవిచందు, పూర్ణచందు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ

గుండెపోటుతో సిపిఎం నేత రాము మృతి

ప్రజాశక్తి - నరసాపురం

సిపిఎం నరసాపురం పట్టణ కమిటీ సభ్యులు, సిఐటియు పట్టణ కార్యదర్శి పొన్నాడ రాము (బాబాయ్) సోమవారం గుండె పోటుతో మరణించారు. వైజాగ్‌లోని తమ బంధువుల ఇంట్లో ఓ కార్య క్రమంలో పాల్గొనడానికి వెళ్లిన ఆయన గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం నరసాపురంలో జరుగుతా యని బంధువులు తెలిపారు. ఆయన మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారావెమ్మాహన్ రాయ్ సంతాపం తెలిపారు. పొన్నాడ రాము 1984లో అటుకుల మిల్లు కార్మికునిగా చేరి యూనియన్‌లో చేరారు. 1986లో డివైఎఫ్ఐ టౌన్ అధ్యక్షునిగా పనిచేశారు. అనంతరం సిఐటియు నరసాపురం డివిజన్ కమిటీ సభ్యులుగా పనిచేశారు. పలు నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు, పార్టీ, ప్రజాసంఘాల కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా ఉండేవారు. కార్మికుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతం సిఐటియు పట్టణ కార్యదర్శిగా, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులుగా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

పొన్నాడ రాము (బాబాయ్) (ఫైల్‌ఫోటో)

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను జీలుగుమిల్లి సిఐ బివి.రావుతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాలు పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ మండలంలో జూదక్రీడలపై నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసుల్లో జాగ్రత్తలు వహించాలన్నారు. కేసుల నమోదులో జాప్యం లేకుండా చూడాలన్నారు.

హాస్టళ్లలో వాషింగ్ మెషీన్లు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటి హాస్టళ్లలో కొత్త వాషింగ్ మెషిన్లను డైరెక్టర్, ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ సోమవారం ప్రారంభించారు. ట్రయల్ బేస్‌లో మొత్తం 15 వాషింగ్ మెషిన్లు (ఒక్కో హాస్టల్‌లో మూడు) అమర్చారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు వీటిని ఉపయోగించుకోవడం ద్వారా చాలావరకు నీటి వృధాను కూడా తగ్గించుకోవచ్చన్నారు. విద్యార్థుల అవసరాన్ని బట్టి వాషింగ్ మెషీన్ల సంఖ్య పెంచుతామని తెలిపారు.

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో సిపిఎం మండల సమావేశం పిల్లి మురళి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.రాజు మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి వారిని ఆదుకోవాలన్నారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలతో పాటు, వాటి శివారు గ్రామాల్లో వైరల్, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వారి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఆరోగ్య సదస్సులు నిర్వహించాలని కోరారు.

'జితేంద్రచౌదరిపై దాడి దారుణం'

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్) జాతీయ ఛైర్మన్ జితేంద్ర చౌదరిపై త్రిపుర అగర్తలలోని తన నివాసంలో విస్వ హిందూ పరిషత్ గూండాలు దాడి చేయడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం ఏలూరు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నటు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్మల రమేష్ తెలిపారు. జితేంద్రచౌదరిపై దాడి చేసినవారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జితేంద్ర చౌదరి త్రిపుర రాష్ట్రంలో దేశవ్యాప్తంగా ఆదివాసీ హక్కులు, చట్టాల రక్షణ కృషి చేస్తున్నారన్నారు. దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

ప్రజాశక్తి - మండవల్లి

ముంపు బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని భైరవపట్నం శుభ ఫంక్షన్ హాలులో ముంపు గ్రామాల ప్రజలతో సోమవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముంపు బాధితులను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ముంపునకు గురైన 400 గ్రామాలను ఆదుకునే విధంగా గ్రామానికి రూ.లక్ష చొప్పున పరిహారం అందించారన్నారు. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, నందిగామలంక, ఎంగిలిపాకలంక, కొవ్వాడలంక, మణుగూరు తదితర ఐదు గ్రామాలకు చెక్కులు పంపిణీ చేశారు. కొల్లేరుకు చేరిన వరద నీరు కిందకు ప్రవహించేలా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

వలస కూలీ ఆత్మహత్య

ప్రజాశక్తి - కుక్కునూరు

ఫోన్ మాట్లాడవద్దని అన్నయ్య మందలించాడని మనస్తాపానికి గురైన సోదరి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... చత్తీష్‌ఘఢ్ రాష్ట్రంలోని దంతలవాడ గ్రామానికి చెందిన సన్ని, సున్ని దంపతులకు కుమారుడు, కుమార్తె పైకి (18) ఉన్నారు. అన్నాచెల్లెలు కొంతకాలంగా గణపవరం గ్రామానికి చెందిన జి.రాంబాబు నర్సరీలో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో పైకి (18) తరచూ ఫోన్ మాట్లాడుతుండడంతో తన్న అన్నయ్య మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన పైకి జామాయిల్ చెట్టుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

కేటుగాడు అరెస్టు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వయసు పైబడి ఎటిఎంలో డబ్బులు ఎలా తీసుకోవాలో తెలియని వారిని అతను గురిగా చేసుకుని మోసాలకు పాల్పడుతూ డబ్బులు దొంగిలిస్తున్న కేటుగాడిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించి డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం గ్రామానికి చెందిన సురేంద్రకుమార్ క్రికెట్ బెట్టింగులకు, పేకాటకు బానిస అయ్యాడు. సులువైన మార్గంలో డబ్బులు సంపాదించాలనుకున్నాడు. ఈ క్రమంలో 2019 నుంచి ఎటిఎంల వద్ద వయసు పైబడి చదువు రాని వారిని గురిగా చేసుకున్నాడు. అలాంటివారు ఎటిఎంలోకి వెళ్లగానే ఇతను కూడా వారితో పాటు లోపలికి వెళ్తాడు. అప్పుడు వారు డబ్బు ఎలా తీయాలని అడుగగానే వారి ఎటిఎం కార్డును తీసుకొని అందులోని పిన్ నెంబర్‌ను గుర్తుపెట్టుకుని వారికి డబ్బులు తీసి ఇచ్చిన వెంటనే తన వద్ద ఉన్న పని చేయని ఎటిఎం కార్డును వారికి ఇస్తాడు. వారు వెళ్లిపోయాక వారి కార్డు ద్వారా డబ్బులు తీస్తాడు. ఇలా ఉభయగోదావరి జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. 2023లో కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇతనిపై కేసు నమోదైంది. 2024లో మరో కేసు నమోదైంది. ఏలూరు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 2024లో కేసు నమోదైంది. ఈ మూడు కేసుల్లో పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కైకలూరు పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో పోలీసులకు సురేంద్రను తనిఖీ చేశారు. దీంతో అతను ఎటిఎం దొంగతనాలకు పాల్పడుతున్నాడని గుర్తించి అరెస్టు చేశారు. కేసును అత్యంత చాకచక్యంగా పరిష్కరించిన కైకలూరు పట్టణ సిఐ కృష్ణ, ఎస్ఐ సత్యనారాయణలను డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన కురెళ్లగూడెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఉంగుటూరు గ్రామానికి చెందిన పిల్లా విష్ణు(35) వెల్డింగ్ పని చేస్తుంటారు. ప్రస్తుతం ఆయన తన అత్తగారి ఊరైన కురెళ్లగూడెంలో భార్యా పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన పి.కన్నాపురం రోడ్డు వద్ద వెల్డింగ్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత విష్ణు స్వగ్రామం నుంచి కురళ్లగూడేనికి బైక్‌పై బయలుదేరాడు. విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం వైపు బత్తాయి కాయల లోడుతో వెళ్తున్న లారీ విష్ణును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన విష్ణు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం జరిగిన తర్వాత లారీ వేగాన్ని నియంత్రించే క్రమంలో ఆ ప్రాంతం గోతులు మయంగా ఉండటంతో లారీ బోల్తా పడింది. దీంతో లారీ రోడ్డుకు రెండో వైపున వెళ్తున మోటార్‌సైకిల్‌పై పడింది. మోటార్ సైకిల్ నడిపే వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చనిపోయిన విష్ణుకు వికలాంగురాలైన భార్య, మూడేళ్ల పాప ఉన్నారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరాలపై దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసి పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని లంకాలపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎఎస్ఐ వి.జయకుమార్ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. టి.నరసాపురం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,550 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రభుత్వాసుపత్రిలో పసికందు మృతి

వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని బాలింత ఆందోళన

ప్రజాశక్తి - టి.నరసాపురం

తల్లడిల్లుతున్న బాలింత

మండలంలోని బొర్రంపాలెం ప్రభుత్వాసుపత్రిలో పసికందు మృతి చెందింది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. కోటి ఆశలతో తొమ్మిది నెలలు మోసిన బిడ్డ పుట్టగానే మృతి చెందడంతో కన్నతల్లి తల్లడిల్లి పోతుంది. పసికందు మృతితో ఆగ్రహించిన కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. స్థానికులు, బొర్రంపాలెం గ్రామానికి చెందిన మహిళ రేఖ తెలిపిన వివరాల ప్రకారం... రేఖకు పురిటి నొప్పులు రావడంతో ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేరింది. ఈ క్రమంలో ఆమెను పరిక్షించిన వైద్యులు డెలివరీ అవడానికి సమయం పడుతుందని చెబుతూ వచ్చారని, సోమవారం సాయంత్రం నాలుగు తర్వాత పురుడు వచ్చిందని చెప్పారు. ఆ తర్వాత తన బిడ్డను జంగారెడ్డిగూడెం పిల్లల ఆసుపత్రికి పంపారని, అప్పటికే బిడ్డ మృతి చెందిందని తెలిపారని చెప్పారు. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆసుపత్రికి చేరుకుని బిడ్డ మృతికి కారణం వైద్య సిబ్బందేనని, వైద్య సహాయం అందించడంలో నిర్లక్ష్య వైఖరి వల్ల బిడ్డ మృతి చెందిందని ఆందోళనకు దిగారు. ఈ విషయంపై వైద్యురాలు ఇమాంబీని అడుగగా బిడ్డకు తల్లి కడుపులోనే పేగు చుట్టుకుని ఊపిరాడక మృతి చెందిందని తెలిపారు. అనంతరం అక్కడకు చేరుకున్న ఎస్ఐ జయకుమార్, వైద్య సిబ్బంది బాధితులతో చర్చించి సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - నిడమర్రు

నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు చెప్పారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని ఛానమిల్లిలో ముంపునకు గురైన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొల్లేరు వైపు నుంచి ఉధృతంగా వస్తున్న వరద నీరు పంట పొలాల్లోకి వెళ్లకుండా రైతులు వేసిన అడ్డగట్టులను పరిశీలించారు. భవిష్యత్తులో సంభవించే వరదల వల్ల పంట పొలాలకు ఎటువంటి నష్టం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. అనంతరం ఎంఎల్ఎ రైతులతో మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా కూటమి ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

చాట్రాయి : వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురైన మండలంలోని పంటలను వ్యవసాయ శాఖ సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది సోమవారం పరిశీలించారు. చాట్రాయి మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో వరి 11 ఎకరాల సాగులో ఉండగా పత్తి 220 ఎకరాల్లో సాగులో ఉంది. వ్యవసాయ శాఖాధికారి బి.శివశంకర్, రెవెన్యూ శాఖ విఆర్‌ఒలు రైతులను కలిసి పంట పొలాలను పరిశీలించి వరిలో, పత్తిలో అధిక నీరు నిల్వ ఉండకుండా కాలువల ద్వారా బయటకు పంపాలని, అనంతరం వరిలో ఒక ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పటాస్ వేయాలని వరి త్వరగా పుంజుకుంటుందని చెప్పారు. తెగుళ్ల నివారణకు లీటర్ నీటికి ఒక గ్రాము కార్బెండిజం, రెండు గ్రాముల మాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పత్తిలో ఎకరానికి 25 కేజీల యూరియా, పది కేజీల పొటాష్ కలిపి ఎరువులను బూస్టర్ మోతాదులోపైపాటుగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒలు, విహెచ్ఎ, ఎంపిఇఒలు, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పేరూరు, దాకారం గ్రామాల్లో పర్యటించి ముంపు బారిన పడిన పొలాలను మండవల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముంపు బారిన పడిన పొలాల్లోని నీటిని త్వరితగతిన బయటకు పోయేవిధంగా రైతులు కాలువలు తీసుకోవాలన్నారు. పొలాల్లో నీరు బయటకు పోయిన తర్వాత పైరు త్వరగా కోలుకోవడానికి ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పైపాటుగా వేయాలని సూచించారు.

పోలవరం : కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పోలవరం మండలంలో ముంపునకు గురైన పంట పొలాలకు రైతుల జాబితా ఎన్యుమరేషన్ చేయించేందుకు మండలంలో పని చేస్తున్న రైతు సేవ కేంద్రం సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం సమావేశం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్.దేవకీదేవి తహశీల్దార్ బిఎస్‌విఎస్ఆర్ఎల్. రాజు, ఎంపిడిఒ జి.శ్రీను, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

గ్రామ పంచాయతీలకు రూ.లక్ష చెక్కులు అందజేత

ఏలూరు సిటీ : చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక ఏలూరు జిల్లా పంచాయతీ పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు సమన్వయకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, గోపాలపురం ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు సారథ్యంలో చెక్కులు అందించారు. దెందులూరు, గోపాలపురం నియోజకవర్గాలకు చెందిన 20 కేంద్రాల్లో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి నాయకుల సమక్షంలో సంబంధిత గ్రామాల సర్పంచులకు రూ.లక్ష చెక్కులు అందించారు. ఏలూరులో జిల్లా పంచాయతీ పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాద్ హాజరయ్యారు. వారి చేతుల మీదుగా 20 చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, సిఇఒ సుబ్బారావు, జనసేన నాయకులు నారా శేషు, రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని ఆరు పంచాయతీలకు రూ.లక్ష చొప్పున రూ.ఆరు లక్షలు ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అందించారు.

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఇటీవల సంభవించిన వరదలకు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ తన సొంత నిధుల నుంచి రూ.నాలుగు కోట్ల రూపాయల సాయం ప్రకటించారు. ఈ సాయంలో భాగంగా పోలవరం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 31 పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. వీటిలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు పంచాయతీలు ఉన్నాయి. కొయ్యలగూడెం వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, టిడిపి పోలవరం కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి పాదం నాగకృష్ణ, మద్దు తేజ, టిడిపి, జనసేన, బిజెపి మండలాధ్యక్షులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని మూడు పంచాయతీలకు రూ.లక్ష చొప్పున చెక్కులను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పంచాయతీ సర్పంచులకు అందించినట్లు జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు సోమవారం తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఇటీవల కాలంలో వచ్చిన వరదల తాకిడికి గురైన పంచాయతీలకు తన సొంత నిధుల నుంచి రూ.నాలుగు కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో 31 పంచాయతీలను ఎంపిక చేయగా వాటిలో అప్పలరాజుగూడెం, బండివారిగూడెం, బంధంచర్ల పంచాయతీలను ఎంపిక చేశారు. ఆ పంచాయతీలకు రూ.లక్ష చొప్పున చెక్కులను పోలవరం ఎంఎల్ఎ చేతులమీదుగా కొయ్యలగూడెంలో అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షులు అడపా నాగరాజు, బిజెపి మండలాధ్యక్షులు మాలెంపాటి హరిబాబు, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు ఉన్నారు.



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

వేలేరుపాడు రూరల్ : వేలేరుపాడు మండలానికి చెందిన కోయిదా, కటుకురు, నాళ్లవరం, తిరుమలాపురం, తాట్కూర్‌గొమ్ము, రేపాక గొమ్ము, రుద్రంకోట పంచాయతీలకు ఒక్కో పంచాయతీకి రూ.లక్ష చొప్పున రూ.ఏడు లక్షల చెక్కులను స్థానిక అధికారులు, జనసేన మండల నాయకులకు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే రూ.20 కోట్ల నిధులు కేటాయించారన్నారు. రానున్న రోజుల్లో రూ.వంద కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్, జనసేన మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, జనసేన ప్రధాన కార్యదర్శులు కొవ్వల క్రాంతికుమార్, సంజయ్, పంచాయతీ సెక్రటరీలు దావిద్, రవి, డిఎల్‌పిఒ, తహశీల్దార్ చెల్లన్న దొర పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు మండలంలో ఆరు పంచాయతీలకు రూ.లక్ష చొప్పున రూ.ఆరు లక్షల చెక్కులు అందించారు. సర్పంచులకు ఎంఎల్ఎ చిర్రి బాలరాజు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, తాండ్ర రవిప్రసాద్, టిడిపి మండలాపాధ్యక్షులు మధుర వెంకటరామణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కామినేనికి తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - మండవల్లి

కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాసరావుకు పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం కైకలూరు మండలంలో నీట మునిగిన గ్రామాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడేందుకు వర్షంలో బయలుదేరారు. పందిరిపల్లిగూడెం వెళ్తుండగా మార్గమధ్యంలో వరద నీటి ఉధృతి తీవ్రంగా ఉండడంతో ఆయన ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పింది. అప్రమత్తమైన సిబ్బంది వాహనం వద్దకు చేరుకుని వాహనంలో ఉన్న ఆయనను బయటకు తీసుకొచ్చి వేరే వాహనంలో తరలించారు.

నిమజ్జనంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని, నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని నగర పాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ చెప్పారు. నగరంలో పెద్దసంఖ్యలో భక్తులు వినాయక ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. సోమవారం మూడో రోజు కావడంతో నిమజ్జన కార్యక్రమాలు మొదలవుతాయని ముందుగానే ఏర్పాట్లు చేశామన్నారు. కృష్ణ కాల్వ వెంబడి ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో తూర్పు లాకులు వద్ద, మినీ బైపాస్ రోడ్డులో గ్రీన్ సిటీ వద్ద రెండు ప్రాంతాల్లో నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామన్నారు.

వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు

ప్రజాశక్తి - చాట్రాయి

వర్షాలకు చనుబండ పంచాయతీలో చనుబండ, సూరంపాలెంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరాయి. నీటిని బయటకు పంపించేందుకు సర్పంచి జ్యోతి ఆధ్వర్యంలో చనుబండ గ్రామపంచాయతీ సెక్రటరీ నాగరాజు జెసిబి సాయంతో కాల్వలు తీయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనమా వాసు, రామకృష్ణ, తేనెటి సత్యం పాల్గొన్నారు.

సర్పంచి తల్లి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సంకర్షణపురం గ్రామ సర్పంచి సంకుల వెంకట నాగరాజు మాతృమూర్తి సంకుల సుబ్బమ్మ (70) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పలువురు ఎన్‌డిఎ నాయకులు, ప్రజా ప్రతినిధులు సందర్శించి అంజలి ఘటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సోమవారం సంకర్షణపురంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఏలూరు అర్బన్ : జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సోమవారం స్థానిక అమీనాపేటలోని బాలికల బిసి సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ వసతి గృహంలో బాలికలకు అందుతున్న వసతులను పరిశీలించారు. వసతి గృహంలో పారిశుధ్యం, మురుగునీరు అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యార్థులకు విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ లాయర్లు ఎ.గంగాభవాని, కె.సునీత పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు ఆహారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఏలూరు నగర ప్రజలు ఇళ్లల్లో చెత రోడ్ల మీద వేయకూడదని, ప్రతిరోజు తినే ఆహారంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తమ్మిలేరు వెంబడి నివసించే కుటుంబాల వారు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ భానుప్రతాప్ అన్నారు. ఎంఎల్ఎ బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పెదబాబు సూచన మేరకు వరుసగా ఎనిమిదో రోజు విజయవాడ వరద బాధితులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాన్ని నగరపాలక సంస్థ తరపున పంపినట్లు తెలిపారు.

వరద బాధితులకు భవన నిర్మాణ కార్మికుల సాయం

కలిదిండి : వరద ప్రభావిత ప్రాంతాలకు తమ వంతు సాయంగా భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) సభ్యులు రూ.ఏడు వేలు ఆ సంఘం ఏలూరు జిల్లా నాయకులకు పంపినట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు పరసా రాజేష్ తెలిపారు. బిల్డింగ్ వర్కర్స్ ఏకతా టిపైకి వచ్చి సాయంలో పాలుపంచుకున్నారని చెప్పారు.

'కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటెన్సిఫయిడ్ ట్రైనింగ్ పేరుతో ఎఎన్ఎంలకు స్టాఫ్ నర్సుల ఉద్యోగాలను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఏలూరు సర్వజన ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ గత ప్రభుత్వం సర్వీస్‌లో ఉన్న ఎఎన్ఎంలకు ఇంటెన్సిఫైడ్ జిఎన్ఎం పేరుతో 18 నెలల పాటు శిక్షణ ఇచ్చారన్నారు. దీంతో నర్సింగ్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ గతంలోనే అనేకసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించామని చెప్పారు. హైకోర్టులో నర్సింగ్ వ్యవస్థకు జరుగుతున్న అన్యాయాన్ని వివరిస్తూ పిటిషన్ దాఖలు చేయగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇంటెన్సిఫైడ్ వారికి కేవలం నైపుణ్య శిక్షణమాత్రమే ఇస్తున్నామని, వారికి స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు ఇవ్వడం లేదని తప్పుడు సమాచారం కూడా అందించారన్నారు. ప్రస్తుతం జిఒ 115 విడుదల చేసి ఇంటెన్సిఫైడ్ శిక్షణ తీసుకున్న వారికి స్టాఫ్ నర్స్‌ల ఉద్యోగాలు ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ అత్యవసర విధులు కొనసాగిస్తూ దశలవారీ నిరసనకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.నాగేశ్వరి, భ్రమరాంబ, లలితకుమారి, కె.జోష్నదేవి, గౌతమి, వసుధ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నికృష్ణకు సౌతిండియా ఐకానిక్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ కళాశాలలో ఎంబిఎ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొలుసు చిన్నికృష్ణ సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డుకు ఎంపికైనట్లు ఐకానిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఆర్.అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం గుంటూరులోని కెనడీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో కృష్ణా-గుంటూరు ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా చిన్నికృష్ణ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ కళాశాల యాజమాన్యం ఆయనను అభినందించారు.

అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ చిన్నికృష్ణ

భీమడోలు సిఐగా విల్సన్

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సిఐగా యుజె.విల్సన్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకు వీరి స్థానంలో పనిచేసిన బిబి.రవికుమార్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. సిఐగా బాధ్యతలను స్వీకరించిన యుజె.విల్సన్‌ను భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్‌తో పాటు పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గణేష్ ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు నిబంధన అతిక్రమిస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సుభాని హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్, ఎంపిడిఒ మల్లీశ్వరి, ఎస్ఐ డి.వెంకట్‌కుమార్‌తో కలిసి గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాయింట్ యాక్షన్ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ తరపు నుంచి విఆర్‌ఒ, ఎంపిడిఒ వైపు నుంచి పంచాయతీ సెక్రెటరీ, పోలీస్ వైపు నుంచి మహిళా పోలీసులు ఒక టీమ్‌గా ఏర్పడి వారి వారి గ్రామాల్లో ఎక్కడైతే ఉత్సవ కమిటీలు ఉంటాయో వాళ్ల దగ్గరికి వెళ్లి తగు జాగ్రత్తలు చెప్పి వాళ్లతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

గణేష్ లడ్డూ రూ.51 వేలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని దొంతవరంలో వినాయక చవితి వేడుకలు మూడో రోజు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రసాదంగా ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఆ గ్రామ సర్పంచి కంభంపాటి సత్యవతి, సూరిబాబు రూ.51 వేలకు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు.

CHANGE OF NAME

MY NAME : **GURRALA ANIL KUMAR**
FATHER : **VEERASWAMY GURRALA**
MOTHER : **RANAMMA GURRALA**
Address: 2-6A, 2nd Road Rani Nivasam, 27th Division, Raja Rajeswari Nagar, Tangellamudi, Eluru-534005.

Last Time Issued With Spelling in Correct As per the Documents it Should be **Ranamma** Kindly Do the Same Changes as per Original Documents

CHANGE OF NAME

I, GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU, S/o **Gadiraju Surpa Raju,** R/o Flat No.301, Sainadh Appartment, Steamer Road, Near Tailor High School, Narasapuram, W.G.Dist., A.P.,

My daughter, **HEMA RAMYA GADIRAJU,** in her SSC certificate, her father's name was wrongly registered as **'RAMA KRISHNAM RAJU'** instead of **'GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU'.** Her father's correct name is **'GADIRAJU VENKATA SEETA RAMA KRISHNAM RAJU'.**

పోయినవి

తాడేపల్లిగూడెం డో.నెం. 1-28/6/1, కడకట్ల 31వ వార్డు కాపురస్తులు మొక్కరాల శ్రీనివాసరావు అను నేను నాకు కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్‌లో అకౌంట్ కలదు. అకౌంట్ నెంబర్: 24140026441. ఈ అకౌంట్‌కు సంబంధించిన చెక్ బుక్ బ్యాంక్ పాస్‌బుక్ ఉన్న బ్యాగ్ నేను బ్యాంక్‌కు వెళుతుండగా 10 రోజులు క్రిందట నా బ్యాగ్ పడిపోయినది. **చెక్ నెంబర్లు: 035801, 035802, 035803, 035804.** ఆ బ్యాగ్‌లో ఈ నెంబర్ గల చెక్‌లు ఉన్నవి. నేను వెళ్లిన మార్గములో ఎంత వెతికినను ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికినచో మాకు సంప్రదించవలసినదిగా కోరుతున్నాను.

నా సెల్ నెంబర్: 9848025818

పాస్‌పోర్టు పోయినది

మల్లుల త్రిమూర్తులు తండ్రి : శ్రీనివాసరావు అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. ఇంటి నుండి జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా నాయొక్క పాస్పోర్ట్ పోయింది. పాస్పోర్ట్ నెంబర్ : **L9025180** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు

అడ్రస్:
మల్లుల త్రిమూర్తులు
తండ్రి : శ్రీనివాసరావు, డోర్ నెంబర్ : 2-118, బండివారిపాలెం, గుమ్ములూరు పోస్ట్, గుమ్ములూరు, పోడూరు మండలం ఆంధ్రప్రదేశ్, ప.గో. జిల్లా, పిన్ : 534267
సెల్ : 8985448979

In the Court of the IInd Addl. Judicial Ist Class Magistrate, Bhimavaram
O.S. No. 500/2022

Between:
Plaintiff:
Andhra Bank, Amangamated into Union Bank of India, Tundurru Branch, Rep. by its Branch Manager.

Defendants:
1. Rayudu Devi Durga
2. Gubbala Veera Satyanarayana

పై నెంబరు దావాలో ప్రతివాద్లుకు ఎన్నిసార్లు సమన్లు పంపినను అవి అందుకోకుండా కాలయాపన చేయుచున్నారు. వాది శ్రీ కోర్టు వార్కి ప్రతివాద్లుపై పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేయగా సదరు కోర్టు వారు I.A. No. 157/2024 ద్వారా ఆర్డరు వేసినారు. ప్రతివాద్లు **ది. 04-10-2024వ తేదీన గం॥ 10.30 ని॥లకు** కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని ఎడల శ్రీ కోర్టు వారు మీపై Exparte ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయుచున్నాము.

అల్తి శివరామకృష్ణ
అడ్వకేట్, శ్రీరాంపురం
భీమవరం-2
సెల్: 9848460585

భీమవరం
9-9-2024